క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కొండపర్వ(విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ గ్రామానికి చెందిన పాలాటి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో పిన్నమనేని అస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ కంచర్ల కుమారి అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో పలువురు వలంటీర్‌ను అభినందించారు.

ఘంటసాలకు స్వర నివాళి



నూజివీడు: గాన గంధర్వ ఘంటసాల జయంతిని పురస్కరించుకుని నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత అకాడమీ, రాగసుధ మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో సంగీత విభావరి నిర్వహించారు. పలువురు ఔత్సాహిక గాయనీగాయకులు అలనాటి ఘంటసాల ఆలపించిన మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో నూజివీడు కళావేదిక నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్, శ్రీ సత్య నృత్య సంగీత అకాడమీ నిర్వాహకులు వేంపాటి మోహన్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు



ఆగిరిపల్లి: మద్యం తాగి వాహనలు నడపరాదని నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్ సెంటర్‌లో సీఐ బాల సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని సీఐ తెలిపారు. ఎస్సై చంటిబాబు పాల్గొన్నారు.

మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్రంలోని బీజేపీ మత రాజకీయాలు చేస్తుందని, దేశంలో లౌకికత్వం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పార్టీ బలంగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని సీపీఐ కార్యాలయం ఉప్పలపాటి సుబ్బరాజు భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ, నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ సీపీఐ శత వార్షికోత్సవాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. అనంతరం పార్టీలో కొత్తగా సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, జి.ఈశ్వరయ్య, లంక దుర్గారావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, బుద్దే రాజా, యు.శివప్రసాదరాజు, టి.పూర్ణయ్య, వై.జోసెఫ్, కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

గాయకులు పోటీతత్వం అలవాటు చేసుకోవాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులు పోటీ తత్వం అలవాటు చేసుకోవాలని శ్రీధర్ ఈవెంట్స్ వ్యవస్థాపకుడు గెడ్డం మంగరాజు అన్నారు. సినీ సంగీత దర్శకుడు ఘంటసాల 101 జయంతి సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం జిల్లా స్థాయి ఘంటసాల పాటలపోటీలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చిట్టిబాబు నిర్వాహకుల కృషిని అభినందించారు. పాటల పోటీలలో 30 మంది పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో శివకుమారి, వెంకట్, సుకన్యలకు ప్రథమ ద్వితీయ బహుమతులను అందజేశారు. సినీ సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు పాల్గొన్నారు.

నూజివీడు అభివృద్ధి మరింత వేగవంతం

రూ.16 కోట్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్



నూజివీడు పట్టణం

నూజివీడు: తమ ప్రాంతంలో ముఖ్యమంత్రి పర్యటించారంటే హామీల వర్షం కురిపిస్తారనే ఆశాభావం ప్రజల్లో సాధారణంగా ఉంటుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 17న నూజివీడులో పర్యటించి పట్టణానికి రూ.కోట్లు మంజూరు చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా మూడుసార్లు నూజివీడు ప్రాంతంలో పర్యటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా మంజూరు చేసిన దాఖలాల్లేవు. 2004–2009 సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నూజివీడులో ముఖ్యమంత్రి హోదాలో మూడుసార్లు పర్యటించి మూడు పెద్ద పథకాలను ప్రకటించి ఏర్పాటు చేశారు. అందులో ఒకటి ఐదు వేల ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి ఎమ్మార్ అప్పారావు కాలనీని, ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, కృష్ణా జలాల పథకం ఏర్పాటుకు రూ.66 కోట్లు మంజూరు చేసి నూజివీడు ప్రాంతానికి వెలకట్టలేని ప్రాజెక్టులను అందించారు.

నూజివీడుకు వరాల జల్లు కురిపించిన సీఎం వైఎస్ జగన్

ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలోనే నడుస్తున్నారు. ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అడిగిందే తడవుగా గత నెల 17న నూజివీడులో పర్యటించిన సీఎం వైఎస్ జగన్ పట్టణానికి వరాల జల్లు కురిపించారు. ఇందులో భాగంగా పట్టణంలో 16 వార్డు సచివాలయాలుండగా ఒక్కొక్క సచివాలయానికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.16కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో ఆయా వార్డుల్లో సీసీ డ్రెయినేజీల నిర్మాణం, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో పట్టణంలో డ్రెయినేజీలు మరింతగా అభివృద్ధి చెందేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి మార్గం సుగమం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.16 కోట్లు మంజూరు చేయడంతో పట్టణంలో మరింత అభివృద్ధికి మార్గం సుగమవుతుంది. ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేసిన సీఎంలలో గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డిని, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తున్నాం. ప్రజలకు మంచి చేయడంలో వీరు ఎప్పుడూ ముందుంటారు.

– పగడాల సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్, నూజివీడు

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం ఈదరకు చెందిన కగ్గా శశిక (11), కగ్గా చంద్రిక (9), గండికోట జగదీష్ (8) 2021 జూన్‌లో శోభనాపురం చెరువులో పడి మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రతిపాదనలు పంపించి సీఎంఆర్ఎఫ్ నుంచి ఎక్స్‌గ్రేషియా మంజూరయ్యేలా కృషి చేశారు. శశిక, చంద్రికకు ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షలు, జగదీష్‌కు రూ.2లక్షలు చొప్పున మంజూరు కాగా ఆ చెక్కులను ఆదివారం పిల్లల తల్లులైన కగ్గా జ్యోతి, గండికోట పంగిడమ్మకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి హరిబాబు, నాయకులు సత్యంబాబు, ఇస్సాకు, సోములు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధనలతో సమైక్యత

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బ్రాహ్మణ వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పుట్రేలలో ఆర్యవైశ్య కార్తిక వనభోజనాలు



గంపలగూడెం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామివత్రం



తిరువూరులో నిర్వహించిన కాపుసంఘం వన సమారాధనలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

విజయవాడరూరల్: కార్తిక వన సమారాధనలు సమైక్యతకు, స్నేహాభిమానాలు పెంచుకునేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఆదివారం రాజుగారి మామిడితోటలో బ్రాహ్మణ కార్తిక వన సమారాధన సందడిగా జరిగింది. బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సంప్రదాయంలో వన విహారానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. యాంత్రిక జీవనంలో కార్తికమాసం కొత్త శోభను తీసుకు వస్తుందని, ఆత్మీయులందరూ ఒక చోట చేరడం వల్ల బంధాలు, బాంధవ్యాలు బలపడతాయన్నారు. ఇలా అందరూ ఒక వేదికగా కలుసుకుంటూ ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. బ్రాహ్మణులంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అపార గౌరవమని మల్లాది విష్ణు అన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ఈ ప్రభు త్వంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మప్రచార పరిషత్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కరోనా కష్టకాలంలో పేద అర్చకులకు రూ. 5వేలు చొప్పున ఈ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, నిడుమోలు రామాసత్యనారాయణ, దమ్మాలపాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పుట్రేలలో..

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం కోటిపల్లిలోని మామిడి తోటలో ఆదివారం నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించి ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తిక వన భోజనాలు నిర్వహించారు. అదేవిధంగా విస్సన్నపేట గాయత్రీ బ్రాహ్మణసేవాసమితి ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఎ కొండూరు రోడ్డులోని మామిడితోటలో నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తిక భోజనాలు చేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వన సమారాధన కోలాహలంగా నిర్వహించారు. తోటమూలలో గోసవీడు రహదారి వెంట మామిడి తోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ వర్గీయులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, ఉసిరిచెట్టుకు పూజ కార్యక్రమాలను అర్చకులు తూకుంట్ల లక్ష్మణశాస్త్రి, భాస్కరబొట్ల శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపారు. స్టార్ హెల్త్, అలైడ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజిక్ షో చూపరులను ఆకట్టుకొంది.

వన సమారాధనలతో సందడి

తిరువూరు: కార్తిక మాస వన సమారాధనలతో తిరువూరు ప్రాంత మామిడి తోటల్లో ఆదివారం సందడి నెలకొంది. శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజుపేట విజన్ స్కూల్ వద్ద మామిడితోటలో నిర్వహించిన వనసమారాధనలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే నాయకుడు చందు జనార్థన్, రాష్ట్ర హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చైర్మన్ రామిశెట్టి వీరాస్వామి పాల్గొన్నారు. తిరువూరు సర్వోదయ యూపీ స్కూలు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ముత్తగూడెం సమీపంలోని మామిడితోటలో వనభోజనాలు చేశారు.

ఓటర్ల నమోదు పారదర్శకంగా ఉండాలి



మైలవరంలో బీఎల్ఓలతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాస్



చాట్రాయి మండలం కృష్ణారావుపాలెంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్



అగిరిపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్రావు

మైలవరం: ఓటర్ల నమోదు పారదర్శకంగా ఉండాలని తహసీల్దారు ఎం. శ్రీనివాస్ తెలిపారు. మైలవరంలో ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటర్ల వెరిఫికేషన్‌లో భాగంగా ఆదివారం స్థానిక 89, 90 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు సుభాకర్, రాజా సమక్షంలో బీఎల్ఓలు బీటీ ఎస్.శ్రీను, సురేష్ కొత్త ఓటర్లు మార్పులు, చేర్పులు గురించి చర్చించారు.

కొత్త ఓటర్లను చేర్చుకోవాలి

చాట్రాయి: యువతను ఓటరుగా నమోదు చేయాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర తెలిపారు. మండలంలోని చనుబండ, కృష్ణారావు పాలెంలో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 21 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయాలని, ప్రతి ఒక్కరికీ ఒక్క ఓటు మాత్రమే ఉండాలన్నారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. తహసీల్దార్ విశ్వనాథరావు పాల్గొన్నారు.

బీఎల్ఓలు బాధ్యతగా వ్యవహరించాలి

ముసునూరు: ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపు తదితర ప్రక్రియను బీఎల్వోలు బాధ్యతగా నిర్వహించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల నమోదు, చేర్పులు, తొలగింపుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రైవ్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. సూరేపల్లిలోని 56వ, చెక్కపల్లిలోని 60వ నంబర్ పోలింగ్‌బూత్‌లను ఆయన పరిశీలించారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, తహసీల్దార్ దాసెరి సుధతో కలిసి వేల్పుచర్ల, బలివే, సూరేపల్లి, చెక్కపల్లి, లోపూడి, రమణక్కపేట, ముసునూరులోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. డి.టి. ఎమిలీకుమారి, ఎంపీడీఓ రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఆర్ఐ దీపిక పాల్గొన్నారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఆగిరిపల్లి: ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీఓ శంకర్రావు సూచించారు. ఆగిరిపల్లి, పలు గ్రామాల్లో ఓటర్ నమోదు కార్యక్రమన్ని ఆదివారం పరిశీలించారు. దరఖాస్తుదారుడు ఇచ్చిన అర్జీకి సంబంధించి పూర్తి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

నేడు పల్లెకు పోదాం కార్యక్రమం

విస్సన్నపేట: మండలంలోని తాతకుంట్ల గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. సంబంధిత అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తాతకుంట్ల గ్రామంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి తెలిపారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

తిరువూరురూరల్: మండలంలోని వామకుంట్లలో బీసీ నేతలు సర్వాయి పాపన్నగౌడ్, సర్దార్ గౌతు లచ్చన్నల విగ్రహాలను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నానీ) ఆదివారం ఆవిష్కరించారు. బీసీల అభ్యున్నతికి ఇరువురు నేతలు చేసిన కృషి అభినందనీయమని ఎంపీ పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించేందుకు బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన నేతలను గుర్తుంచుకోవాలన్నారు. మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, గౌతులచ్చన్న కుమార్తె గౌతు శిరీష, మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుతో ఉపాధి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ కోర్సుతో మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఎల్ అండ్ టీ మైండ్ ట్రీ సాఫ్ట్‌వేర్ నిపుణులు హెచ్ గాంధీ సూచించారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం సైబర్ సెక్యూరిటీ కోర్సుపై అవగాహన సమావేశం నిర్వహించారు. బీటెక్ 3, 4 సంవత్సరాల్లో విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ కోర్సును కూడా నేర్చుకుంటే వెంటనే ఉద్యోగాలు పొందవచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కరస్పాండెంటు నాగేశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఏఓ కిషోర్ పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి కుంకుమార్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మ వారికి సమర్పించిన, అలంకరించిన చీరలను వేలం వేశారు. భక్తులు అమ్మవారి చీరలను వేలంలో దక్కించుకున్నారు.

విద్యకు వైకల్యం ఆటంకం కారాదు



బాలికకు కృత్రిమ కాలు అందజేసిన హీల్ సంస్థ నిర్వాహకులు

ఆగిరిపల్లి: పుట్టుకతో లేదా ప్రమాదంలో అవయవాలు పోగొట్టుకున్న దివ్యాంగ బాలల మానసిక, శారీరక ఎదుగుదలకు, విద్యావికాసానికి అంగవైకల్యం ఆటంకం కారాదని లైఫ్ సైకిల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీఈఓ దీనా హరపణహళ్లి అన్నారు. తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ముదినేపల్లికి చెందిన బి.నాగ శ్రావణికి కృత్రిమ కాలు అందజేశారు. ధనశిక్ష చారిటీస్ ఫౌండేషన్ సంస్థ సభ్యురాలు లావణ్య కందుర్ (అమెరికా) ఆమె సోదరుడు కార్తీక్ కందుర్ జన్మదినోత్సవ సందర్భంగా అందజేసిన విరాళాలతో ఈ కృత్రిమ కాలును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హీల్ సంస్థ సీఈఓఅజయ్ కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

తిరువూరు: మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినందుకు తిరువూరు బోస్ సెంటర్లో ఆ పార్టీ నాయకులు ఆదివారం బాణసంచా కాల్చారు. ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కాంతికుమార్, సురేష్, మాధవరావులు బీజేపీ గెలుపునకు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలను పంచారు.

నూజివీడులో..

నూజివీడు: ఎన్నికల ఫలితాల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయఢంకా మోగించడంతో పాటు తెలంగాణలో మెరుగైన సీట్లు సాధించడంతో పట్టణ, మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసకుమార అప్పారావు, వాసు, పట్టణ అధ్యక్షుడు జనార్దనరావు, నాయకులు శివరాజు వసుంధరాదేవి, రెడ్డి మురళీ, నాగేశ్వరరావు, వైఎస్ దొర్రై, కృష్ణ, అలీషా పాల్గొన్నారు.

తిరువూరులో కాంగ్రెస్ నాయకులు

తిరువూరు: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో తిరువూరు కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చారు. నాయకులు శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, జీవన్‌బాబు, కృష్ణమోహన్, ప్రకాశరావు పాల్గొన్నారు.

తెలుగువారి గుండె చప్పుడు ఘంటసాల



గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: తెలుగు వారి గుండె చప్పుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఆశిష్ ఈవెంట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు సత్యస్వాతి అన్నారు. గాంధీనగర్‌లోని నూతన కళావేదికమీద ఆదివారం ఘంటసాల 101 జయంతి, రాగలహరి, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. సత్యస్వాతి మాట్లాడుతూ పాటను భావరాగయుక్తంగా ఆలపించండంలో ఘంటసాలను మించిన వారు లేరన్నారు. గాయకుడు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఘంటసాల స్వరాన్ని నేటి తరం గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, బండారు నరసింహరావు, నితీష్, వాసలి శ్రీనివాస్, నరేష్, మల్లీశ్వరి, డేవిడ్‌రాజు తదితరులు ఘంటసాల గానం చేసిన గీతాలు 12 గంటలపాటు ఆలపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు వంద మందికి పైగా పాల్గొన్నారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

వ్యాయామంతో శారీరక ఆరోగ్యం



ఎంజీ రోడ్డులో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏడీసీపీ లక్ష్మీపతి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా జీవించవచ్చని స్పెషల్ బ్రాంచ్ అదనపు డీసీపీ లక్ష్మీపతి అన్నారు. రోజూ స్విమ్మింగ్, నడక, సైక్లింగ్ వంటి వాటిలో ఏదోకటి చేయాలని ఆయన సూచించారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ రైడ్‌ను ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎంజీ రోడ్డులో ఏడీసీపీ లక్ష్మీపతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎంజీ రోడ్డులో డీవీ మానర్ హోటల్, బెంజిసర్కిల్ మీదుగా ఏలూరు రోడ్డు, పోలీస్‌కంట్రోల్‌రూమ్, ప్రకాశం బ్యారేజ్ మీదుగా కరకట్ట వద్ద ఉన్న ఆక్వా డెవిల్స్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవితానికి మంచి ఆహారపు అలవాట్లతో పాటు, వ్యాయామం కూడా అవసరమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు స్విమ్మింగ్, సైక్లింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతేగాక కరోనా సమయంలో, వరదలు వచ్చినప్పుడు తమ వంతు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ రెండు దశాబ్దాల కిందట అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం రెండు వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7న వాహనాల వేలం

ఉయ్యూరు: అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఉయ్యూరు ఎస్ఈబీ సీఐ ఎంఏ ఖదీర్ ఆదివారం తెలిపారు. ఎస్ఈబీ డెప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 7న మధ్యాహ్నం రెండు గంటలకు ఉయ్యూరు ఎస్ఈబీ కార్యాలయం వద్ద బజాజ్‌పల్సర్, మారుతీ 800 కారుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9440902451, 9959036522లో సంప్రదించాలని కోరారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం పుల్ గాస్పల్ చర్చిలో ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రెవరెండ్ డాక్టర్ దానియేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్ గాస్పల్ చర్చిలో ప్రార్థనలు నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘస్తులందరికీ ఉచితంగా నూతన సంవత్సరం క్యాలెండర్‌తో పాటు ప్రభువు ఆశీస్సులు అందజేస్తామని తెలిపారు. సంఘస్తులు విశ్వాసకులు ఈ సదవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.